సాక్షి
నిర్మల్

శనివారం : 9 : మార్చి : 2024



ఓంకారేశ్వర ఆలయంలో శివపార్వతుల పల్లకీసేవలో భక్తులు..



నందీశ్వర పాదాల చెంత పూజలు చేస్తున్న యువతులు



ఓంకారేశ్వరాలయంలో వధూ వరుల అలంకరణలో శివపార్వతుల ఉత్సవమూర్తులు

న్యూస్‌రీల్

ఎస్పీకి సన్మానం



ఎస్పీకి మొక్క అందజేస్తున్న నాయకులు

నిర్మల్‌టౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్పీ జానకీషర్మిలను బీఆర్ఎస్ నాయకులు ఎస్పీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి మొక్క అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాకాల ఫౌండేషన్ చైర్మన్ రాంచందర్, అనుముల భాస్కర్, కూన రాజేశ్వర్, ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

మహిళాశక్తి సాటిలేనిది..



మహిళా నాయకులతో స్వదేశ్ పరికిపండ్ల

నిర్మల్‌ఖిల్లా: సమాజ పురోగమనంలో మహిళాశక్తి సాటిలేనిదని, అన్నిరంగాల్లో మహిళలు ముందంజలో ఉండడం సమాజానికి శుభసూచకమని ప్రవాసీమిత్ర కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో జిల్లా మహిళా నాయకులను సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతీరంగంలో ''మహిళల ప్రగతి వేగవంతం చేయండి'' అనే ఇతివృత్తాన్ని ఆధారంగా చేసుకుని వేడుకలు నిర్వహించుకుంటున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మహిళా నాయకులు కొమ్ము గీత, ఏపూరి సంధ్య, శశిమాల, ఉపాధ్యాయులు మమత, సునీత పాల్గొన్నారు.

జనరల్ ఆసుపత్రిలో మహిళా దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న మహిళా సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టీఎన్జీవోస్ మెడికల్ అండ్ హెల్త్ ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. నిర్మల్ జిల్లా కార్యదర్శి అహ్మద్ అబూ అమీర్ మహిళా సిబ్బందితో కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నర్సింగ్ సూపరింటెండెంట్ కమలమ్మతోపా టు హెడ్ నర్సులు హేమలత, కిరణ్మయి, జయలక్ష్మి, అపర్ణను సత్కరించారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, టీఎన్జీవోస్ మెడికల్ అండ్ హెల్త్ ఫోరం కోశాధికారి సంతోష్, ఆసుపత్రి స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నిర్మల్ రూరల్: ఉద్యోగులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దిష్టిబొమ్మను పీఆర్టీయూ ఆధ్వర్యంలో నిర్మల్ ఆర్డీవో శుక్రవారం దహనం చేశారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములైన ఉదోయగులను అవమానించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు వెంటనే క్షమాపణ చెప్పాలని పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, పీఆర్టీయూ తెలంగాణ జనరల్ సెక్రటరీ పార్వతి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న, ప్రధాన కార్యదర్శి వడ్నాల రవిరాజ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, వనం శ్రీనివాసులు, ఉద్యోగ సంఘం నాయకులు పాల్గొన్నారు.



శివోహం..

- వైభవంగా శివరాత్రి వేడుకలు
- 'కదిలి'కి పోటెత్తిన భక్తులు
- శివనామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- వేకువజామునుంచే బారులుతీరిన భక్తులు
- రాత్రి శివపార్వతుల కల్యాణం



ఓంకారేశ్వరునికి అభిషేకం చేస్తున్న యువతులు

నిర్మల్‌టౌన్: మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు శుక్రవారం శివనామస్మరణతో మార్మోగాయి. అభిషేక ప్రియుడికి జల, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పరమశివుడిని దర్శించుకునేందుకు భక్తులు వేకువ జామునుంచే శివాలయాలకు క్యూకట్టారు. నిర్మల్‌లోని బ్రహ్మపురి రథాలగుడిలో అన్నపూర్ణ, విశాలాక్షి సమేత విశ్వేశ్వరాలయంలో పూజలు చేశారు. వెంకటాద్రిపేటలోని ఖజానా చెరువు ఒడ్డున ఉన్న ఓంకారేశ్వరాలయం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. పార్వతీసమేతంగా ఉన్న పరమేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణతల్లి రూపశిల్పి బైరోజు వెంకటరమణాచారి భక్తులతో పూజలు చేయించారు. నిర్మల్ నగర పాలకుడిగా పట్టణ నడిమధ్యలో ఉన్న నగరేశ్వరాలయంలో వేకువజామున 2గంటల నుంచే భక్తుల తాకిడి మొదలైంది. రోజంతా ఇక్కడ భక్తులు దర్శనం కోసం క్యూకట్టారు. నాయుడివాడ గుట్టపై వీరన్నగా కొలువైన వీరేశ్వరుడికి అభిషేకాలు చేశారు. గండిరామన్న గుహలోని రామలింగేశ్వరుడిని సైతం భక్తులు దర్శించుకున్నారు. దత్తసాయి ఆలయ ప్రాంగణంలోని రామలింగేశ్వరుడి వద్ద సాయి దీక్ష సేవాసమితి అధ్యక్షుడు లక్కడి జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. బుధవార్‌పేట్‌లోని శివకోటీశ్వర మందిరంలో భక్తులు అభిషేకాలు చేశారు. బేస్తవార్‌పేట్‌లోని పురాతన రాజరాజేశ్వరాలయంలో, కాల్వగడ్డలో రాజరాజేశ్వరుడి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.



దిలావర్‌పూర్ మండలం కదిలి నందీశ్వర ఆలయంలో శివలింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు



శివపార్వతుల కల్యాణానికి హాజరైన భక్తులు



నాగేశ్వర్‌వాడ శివాలయంలో పరమేశ్వరునికి పూజలు..



శివయ్య దర్శనానికి బారులు తీరిన భక్తులు

'కదిలి' వచ్చారు..

దిలావర్‌పూర్: మండలంలో అత్యంత ప్రాచీన ప్రాశస్త్యంగల శ్రీమతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయంతోపాటు, కాల్వ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం, దిలావర్‌పూర్‌లోని ఏకనాథ ఆలయం, అటవీప్రాంతంలోని శ్రీరాజరాజేశ్వరాలయం, కాల్వ తాండాలోని శివాలయం, బన్సపల్లిలోని రాజరాజేశ్వరాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వేకువజామునుంచే భక్తులు కదిలి పాపహరేశ్వరుడినికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 3 గంటలకు స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, మంత్రపుష్పం నిర్వహించి అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం 5 గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రవికిషన్‌గౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానికి గంటకుపైగా సమయం పట్టింది. క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తాగు నీరు, పండ్లు అందించారు. నిర్మల్‌కు చెందిన జెమినీటీ డ్రిస్టిబ్యూటర్స్ రూ.50 వేల ఖర్చుతో భక్తులకు ఉచితంగా టీ అందించారు. 12 ఏళ్లుగా మహాశివరాత్రి పర్వదినాన ఉచితంగా భక్తులకు టీ, బిస్కెట్ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇక కదిలికి 35 వేల మంది తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు పేర్కొన్నారు. అన్ని శివాలయాల్లో అర్ధరాత్రి స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులు జాగరణ చేశారు. కదిలిలో నిర్మల్ సీఐ శ్రీనివాస్, దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పాతపెన్షన్ విధానం అమలు చేయాలి

- సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు



వినతిపత్రం ఇస్తున్న సీపీఎస్ సంఘం ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: శాసనసభ ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన మేరకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు కోరారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనడానికి వచ్చిన టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ.. తక్షణమే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న రెండు లక్షలకుపైగా సీపీఎస్ కుటుంబాల సామాజిక, ఆర్థిక భద్రతకు భరోసా ఇవ్వాలన్నారు. 317 జీవో అమలు ద్వారా స్థానికతను కోల్పోయిన ఉద్యోగ, ఉపాధ్యాయులను వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభంలోగా స్వస్థలాలకు తెచ్చేలా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలను తీర్చాలని, బీసీ గురుకులాల పనివేళలు మార్చాలని, కారుణ్య నియామకాల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండపల్లి అశోక్, సీపీఎస్ రాష్ట్ర సహాధ్యక్షుడు రేవంత్, జిల్లా నాయకులు సాయికృష్ణ, కొండ ప్రవీణ్, తానాజీ పాల్గొన్నారు.

ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్ కాలనీకి చెందిన అలేఖ్యను నడిరోడ్డుపై పట్టపగలు హత్యచేసిన ప్రేమోన్మాది శ్రీకాంత్‌కు వెంటనే శిక్షపడేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య కోరారు. ఈ మేరకు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో అలేఖ్య కుటుంబీకులతో కలిసి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నిందితుడు శ్రీకాంత్‌తోపాటు అతడికి సహకరించిన శ్రీకాంత్ తల్లి సత్తవ్వ, తమ్ముడు శివకృష్ణకు శిక్షపడేలా విచారణ చేపట్టాలన్నారు. అలేఖ్య కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, శ్రీకాంత్ దాడిలో గాయపడిన అలేఖ్య వదినను ఆదుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే కేసు విషయమై ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు ప్రభుత్వం తరఫున చర్యలు చేపడుతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈనెల 10న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి అలేఖ్య హత్య విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, నాయకులు ఉన్నారు.

హస్తంవైపు 'అల్లోల' చూపు!?

- 'అసెంబ్లీ'లో ఓటమితో బీఆర్ఎస్‌లో నైరాశ్యం
- రాష్ట్రంలో కాంగ్రెస్.. నియోజకవర్గంలో బీజేపీ
- తమకు ప్రాధాన్యత లేదంటున్న గులాబీక్యాడర్
- 'కారు' దిగాలంటూ మాజీ మంత్రిపై ఒత్తిడి



నిర్మల్: పదేళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్న గులాబీ క్యాడర్ ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. లోకల్‌గా ఓడినా.. కనీసం రాష్ట్రంలో ప్రభుత్వం వస్తుందన్న నమ్మకంతో ఉన్న శ్రేణులకు ఆ సంతృప్తి కూడా దక్కలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగా, జిల్లాలోని మూడు అసెంబ్లీ స్థానాల్లో ఒక్కచోట కూడా బీఆర్ఎస్ గెలువలేదు. దీంతో అటు రాష్ట్రంలో.. ఇటు స్థానికంగా ఎలాంటి పొలిటికల్ సపోర్ట్ లేకపోవడంతో శ్రేణులు పూర్తి నైరాశ్యంలో ఉన్నారు. పార్లమెంట్ ఎన్నికల వేళ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు 'కారు' దిగుతుండటంతో జిల్లాపైనా ఆ ప్రభావం కనిపిస్తోంది. ఇక్కడా పార్టీ మారుదామంటూ గులాబీ శ్రేణులు, నేతల అనుచరులు జిల్లాలో పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిపై ఒత్తిడి పెంచుతున్నారు.

పాలుపోని స్థితి..

జిల్లాలో తమకంటూ ఒక్క ఎమ్మెల్యే లేకపోవడం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో బీఆర్ఎస్ శ్రేణులకు ఎటూ పాలుపోవడం లేదు. నిర్మల్, ముధోల్‌లో బీజేపీ బలపడగా, ఖానాపూర్‌లో కాంగ్రెస్ పట్టుసాధించింది. పదేళ్లపాటు వివిధ కాంట్రాక్టులు, పనులను కొనసాగించిన బీఆర్ఎస్ శ్రేణులు ఇప్పుడు వాటిని వదులుకోవాల్సి వస్తోంది. చివరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్ పనుల కాంట్రాక్టులనూ గడువుకు ముందే కోల్పోవాల్సి వస్తోంది. గతంలో తమ పార్టీ ప్రజాప్రతినిధులు కేవలం ఫోన్ చేస్తేనే పనులు పూర్తయ్యేవి. ఇప్పుడు ఎక్కడా ప్రాముఖ్యత దక్కడం లేదు. మరోవైపు అధికారంలోకి వచ్చినవాళ్లు గతంలో గులాబీనేతలు చేసిన పనులపై దృష్టిపెట్టడం, భూకబ్జాలు, సెటిల్‌మెంట్లతో సహా ప్రతీదాన్ని వెలికి తీసి, రచ్చకెక్కించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇవి బీఆర్ఎస్ క్యాడర్‌లో నైరాశ్యాన్ని పెంచుతున్నాయి. చివరకు పార్టీ మారి.. మళ్లీ అధికారపక్షంలో ఉండాలని భావిస్తున్నారు.

భవిష్యత్తుపై భరోసా ఏది..?

ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ బలంగా ఉండటం, జిల్లాలో బీజేపీ బలోపేతం కావడం బీఆర్ఎస్‌పై ప్రభావం చూపుతోంది. రానున్న ఐదేళ్లపాటు తమ రాజకీయ భవిష్యత్తు ఏంటన్న ప్రశ్నలను శ్రేణులు వేసుకుంటున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించే కాంగ్రెస్, బీజేపీలలో ఉన్న ఆశావహుల పోటాపోటీ వాతావరణం తమ పార్టీలో ఎందుకు లేదని ప్రశ్నించుకుంటున్నాయి. ముస్ముందు స్థానిక సంస్థల్లోనూ ఇదే ప్రభావం ఉంటే తమ పరిస్థితి ఏంటన్న చర్చ కొనసాగుతోంది.

'కారు' దిగుతున్న నేతలు..

రాష్ట్రవ్యాప్తంగా సీనియర్లు ఒక్కొక్కరుగా కారు దిగుతున్నారు. తాజాగా ఉమ్మడి జిల్లా నుంచే సీనియర్‌నేత, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్‌వైపు వెళ్లారు. ఇదేదారిలో మరికొందరు ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలోనూ పార్టీ మారితేనే భవిష్యత్తు ఉంటుందన్న చర్చ జోరుగా జరుగుతోంది. ఇదేక్రమంలో సీనియర్‌నేత, మాజీమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డిపై ఒత్తిడి పెంచుతున్నారు. అల్లోల ఒక్కరు పార్టీ మారితే ఆయన వెంట ముధోల్ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి, మిగతా నేతలూ రావడం ఖాయమన్న టాక్ వినిపిస్తోంది. ఈనెల 17 లేదా 18న బీఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్‌లో చేరుతాయన్న పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దీంతో మాజీ మంత్రి కూడా 'కారు' దిగుతారని ఆయన సన్నిహితులు సంకేతాలిస్తున్నారు.

పీఆర్టీయూటీజీ జిల్లా కార్యవర్గం

నిర్మల్ రూరల్: పీఆర్టీయూటీజీ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా యాటకారి సాయన్న, ప్రధాన కార్యదర్శిగా వోడ్నాల రవిరాజు, గౌరవ అధ్యక్షుడిగా సరికొండ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. మండల, జిల్లా పూర్తి కార్యవర్గాన్ని త్వరలోనే ప్రకటిస్తామని సంఘం ప్రతినిధులు తెలిపారు. నూతన అధ్యక్షుడు సాయన్న మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయసంఘం కృషి చేస్తుందన్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్వత సత్యనారాయణ, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు నూర్‌సింగ్, గౌరవ అధ్యక్షుడు ప్రకాశ్ రాథోడ్, మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యాటకారి సాయన్న

నేడు టీయూటీఎఫ్ జిల్లా మహాసభలు

నిర్మల్ రూరల్: తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) జిల్లా మహాసభలు శనివారం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, తోడిశెట్టి రవికాంత్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో నిర్వహించే సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మ లచ్చిరాం, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు మురళీమనోహర్‌రెడ్డి హాజరవుతారని వివరించారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో విద్యారంగ సమస్యలు, అభివృద్ధి కార్యచరణ ప్రణాళికపై తీర్మానాలు చేయనున్నట్లు వెల్లడించారు.

దాడులను ప్రతిఘటించాలి

ఖానాపూర్: రోజురోజుకు మహిళలపై దాడులు పెరుగుతున్నాని, అన్నిరకాల దాడులను ప్రతిఘటించేలా మహిళలు సిద్ధం కావాలని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) జిల్లా అధ్యక్షురాలు నంది సమత అన్నారు. మండలంలోని అడవిసారంగాపూర్ పంచాయతీ పరిధి జిల్లెడికుంట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవానికి హాజరై మాట్లాడారు. సమాజంలో అన్నివర్గాల స్త్రీలపై ఇంట బయట వివక్షత, పురుష దురహంకార దాడులు కొనసాగుతున్నాయన్నారు. అంతర్జాతీయ మహిళా శ్రామిక పోరాట దినం స్ఫూర్తితో దేశంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రామయ్య, పార్టీ మండల కార్యదర్శి అంకుశ్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమత

క్లుప్తంగా

గంజాయి పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్‌: మావల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని రాంనగర్‌ కాలనీలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన గంజాయిని శుక్రవారం పట్టుకున్నట్లు తెలిసింది. సీసీఎస్‌ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు ఇంట్లో భద్రపరచి ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గంజాయితో పాటు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టుబడ్డ గంజాయి మూడు నుంచి మూడున్నర కిలోల వరకు ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై 'సాక్షి' పోలీసులను సంప్రదించగా పట్టుబడ్డ గంజాయికి సంబంధించిన వివరాలను శనివారం వెల్లడిస్తామని తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఎదులాపురం: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈనెల 10న అఖిల భారత షెడ్యూల్డ్‌ కులాలు, జాతుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌ విశ్వేశ్వరయ్య భవనంలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్న సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సమితి కేంద్ర ఉపాధ్యక్షురాలు టి.సుశీల పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్‌ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సమావేశానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు సంబంధించిన ఖాళీలు, భర్తీ, బ్యాక్‌లాగ్‌ పోస్టులు, ఎడ్యుకేషన్‌ పాలసీ, నిరుద్యోగం, మహిళలకు ఉద్యోగ కల్పనలో సమస్యలు, ఇతర అంశాలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఇందులో సమితి రాష్ట్ర, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంగాధర్‌, సుధాకర్‌, తత్వేందర్‌, వీరేందర్‌, సభ్యులు నారాయణ, ఆశన్న ఉన్నారు.

ఫిట్స్‌తో యువకుడి మృతి


గంగాధర్‌ (ఫైల్‌)

నేరడిగొండ: మండలంలోని కుమారి గ్రామానికి చెందిన గజ్జెల గంగాధర్‌ (33) ఫిట్స్‌తో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. గంగాధర్‌ ఇంట్లో ఉండగా ఫిట్స్‌ రావడంతో చికిత్స నిమిత్తం ప్రైవేట్‌ వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఇచ్చోడలోని ఓ బట్టల దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య ఉంది.

హాకీ క్రీడకు పూర్వ వైభవం

ఆదిలాబాద్‌: జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో హాకీ ఆస్ట్రోటర్ఫ్‌ కోర్ట్‌ ఏర్పాటు అయితే జిల్లాలో హాకీ క్రీడకు పూర్వ వైభవం వస్తుందని ఒలంపిక్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో హాకీ కోర్టు పునర్నిర్మాణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. ఖేలో ఇండియాలో భాగంగా జిల్లాకు ఖేలో ఇండియా సెంటర్‌-హాకీ మంజూరైందన్నారు. దీనిలో భాగంగా ఆధునాతన హాకీ కోర్టు నిర్మాణానికి కలెక్టర్‌ ప్రతిపాదనలు పంపారని, ఆమోదం లభిస్తే రూ.8 కోట్ల నిధులతో ఆస్ట్రోటర్ఫ్‌ కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కోర్టు నిర్మాణం పూర్తయితే హాకీ క్రీడాకారులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఎమ్మెల్యే పాయల్‌ శంకర్‌, బదిలీపై వెళ్లిన కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌, ప్రస్తుత కలెక్టర్‌ రాజర్షిషాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పిట్టల్లా రాలి.. పెట్టెల్లో వచ్చి..

- ఉపాధి కోసం వెళ్తే ఆగుతున్న ఊపిరి
- అమలుకు నోచుకోని ఎన్నారై పాలసీ
- పాలకులకు పట్టని గల్ఫ్‌ సంక్షేమబోర్డు
- 'చితికిపోతున్న కార్మిక కుటుంబాలు
- ఆదుకోవాలని బాధితుల డిమాండ్‌



ఈ చిత్రంలోని మహిళ పేరు కొండగొర్ల సత్తవ్వ. జన్నారం మండలం మహ్మదాబాద్‌ గ్రామం. ఈమె భర్త శంకరయ్య ఉపాధి కోసం 2021లో ఇరాక్‌ వెళ్లాడు. అప్పు చేసి వెళ్లిన ఏడాదికే అనారోగ్యం బారిన పడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స అందించినా ఫలితం దక్కలేదు. 2021 డిసెంబర్‌లో మృతి చెందగా, 2022 జనవరిలో మృతదేహం ఇంటికి చేరింది. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబం రోడ్డున పడ్డది. ముగ్గురు ఆడపిల్లల పోషణభారం, ఆర్థిక ఇబ్బందులు ఆ కుటుంబాన్ని వేధిస్తున్నాయి.



ఈ చిత్రంలో కనిపిస్తున్న కునారపు వెంకటేశ్‌ది జన్నారం మండలం దేవునిగూడ గ్రామం. తొమ్మిది నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇక్కడ పని దొరకక ఉపాధి కోసం ఆర్నెళ్ల క్రితం ఏజెంట్‌కు డబ్బులు పెట్టి ఇరాక్‌లోని ఇబ్రహిల్‌ పట్టణానికి వెళ్లాడు. గత జనవరి 30న విధుల్లో ఉన్న ఇతడికి బ్రెయిన్‌స్ట్రోక్‌ వచ్చింది. వెంటనే కంపెనీ యాజమాన్యం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో వెంకటేశ్‌ కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.

ఇలాంటి దీనగాథలు మంచిర్యాల జిల్లాలోని చాలా గ్రామాల్లో కనిపిస్తాయి.




శవపేటికపై పడి ఏడుస్తున్న కుటుంబీకులు (ఫైల్‌)

జన్నారం: ఉన్న ఊరు, తల్లిదండ్రులు, భార్యాపిల్లలను వదిలి ఉపాధి కోసం దేశం గాని దేశం వెళ్లినవారు ఆశలు తీరకుండానే అర్ధంతరంగా తనువు చాలిస్తున్నారు. ఉపాధి వేటలో ఊపిరి వదిలి విగతజీవులవుతున్నారు. పెట్టెల్లో వస్తున్న శవాలను చూసి పుట్టెడు దుఃఖంతో బాధిత కుటుంబీకులు విలవిల్లాడుతున్నారు. గల్ఫ్‌ కార్మికులకు భరోసా కల్పించేందుకు మాజీ సీఎం కేసీఆర్‌ ఇచ్చిన గల్ఫ్‌బోర్డు, ఎన్నారై పాలసీ హామీకి ఇంకా మోక్షం కలగక పోవడంతో గల్ఫ్‌ కార్మికులకు భరోసా లేకుండా పోతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్‌ రాజశేఖరరెడ్డి ఇచ్చిన ఎక్స్‌గ్రేషియా హామీ అమలు చేయాలని గల్ఫ్‌ సంఘాలు డిమాండ్‌ చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నుంచి రాష్ట్రానికి చెందిన 1,800 మంది గల్ఫ్‌ దేశాల్లో వివిధ కారణాలతో మృతి చెంది శవపేటికల్లో స్వగ్రామాలకు చేరుకున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. మంచిర్యాల జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి సుమారు తొమ్మిదివేల మందికిపైగా ఉపాధికోసం వివిధ దేశాలకు వెళ్తున్నారు. రాష్ట్రంలోని ఉమ్మడి ఆదిలాబాద్‌, నిజామాబాద్‌, కరీంనగర్‌, మెదక్‌ జిల్లాల నుంచి అత్యధికంగా వలసలున్నాయి. ఇటీవలి ఘటనలు చూస్తుంటే ఏ క్షణాన ఏ వార్త వినాల్సి వస్తుందోనని గల్ఫ్‌ కార్మికుల కుటుంబాల్లో నెలకొంది.

గుండెపోటు మరణాలే అధికం

ఇంటర్నేషనల్‌ జర్నల్‌ ఆఫ్‌ కమ్యూనిటీ మెడిసిన్‌ అండ్‌ పబ్లిక్‌ హెల్త్‌ 2018 విడుదల చేసిన నివేదిక ప్రకారం ఎన్నారైలు, గల్ఫ్‌ కార్మికులు అత్యధికంగా గుండె పోటుతోనే మృతి చెందుతున్నట్లు తెలుస్తోంది. పగలంతా ఎండలో, రాత్రి ఏసీలో ఉండాల్సి రావడం, మానసిక, శారీరక ఒత్తిడి, నిద్రలేమి, ఆహారపు అలవాట్లు, స్మార్ట్‌ఫోన్లు అధికంగా వాడడం లాంటి కారణాలతో అత్యధిక మంది గుండె సంబంధిత వ్యాధులతో మృత్యువాత పడుతున్నట్లు వెల్లడవుతోంది.

అమలుకాని ప్రభుత్వ హామీలు

2008లో పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన ఓ సమావేశంలో బీఆర్‌ఎస్‌ అధినేత కేసీఆర్‌ ప్రసంగిస్తూ గల్ఫ్‌ బాధితులను ఆదుకోవడానికి రూ.500 కోట్లతో గల్ఫ్‌ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పటయ్యాక గల్ఫ్‌ కార్మికులను ఆదుకునేందుకు ఎన్నారై పాలసీ, గల్ఫ్‌ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఏర్పడి స్వయాన కేసీఆరే సీఎం పదవిలో పదేళ్లున్నా ఆయనిచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని గల్ఫ్‌ కార్మిక సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి



తెలంగాణ ఉద్యమంలో గల్ఫ్‌ కార్మికులమంతా ముందున్నాం. విదేశాల్లో స్వరాష్ట్ర ఆకాంక్ష తెలియజేశాం. తెలంగాణ ఏర్పడ్డాక గల్ఫ్‌ కార్మికులను పట్టించుకుంటలేరు. వివిధ కారణాలతో అనేక మంది పిట్టల్లా రాలిపోతున్నా బాధిత కుటుంబాలపై కరుణ చూపడంలేదు. గల్ఫ్‌ సంక్షేమ బోర్డు, ఎన్నారై పాలసీ తీసుకువస్తేనే బాధిత కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఈ దిశగా కృషి చేయాలి.

– కల్లెడ భూమన్న, గల్ఫ్‌ కార్మికుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు

కలగానే ఎన్నారై పాలసీ, గల్ఫ్‌ బోర్డు

గత ప్రభుత్వాలు ఇచ్చిన ఎన్నారై పాలసీ, గల్ఫ్‌ సంక్షేమ బోర్డు ఏర్పాటు హామీలు కలగా మిగిలాయని గల్ఫ్‌ ప్రతినిధులు వాపోతున్నారు. ఉపాధి కోసం వెళ్లిన కార్మికులు అనేక సందర్భాల్లో ప్రమాదాలు, అనారోగ్యం, ఏజెంట్ల మోసాల కారణంగా మృత్యువాత పడుతున్న విషయం తెలిసిందే. దీంతో వారినే నమ్ముకున్న కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. భార్యాపిల్లలు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఈ క్రమంలో గల్ఫ్‌ సంక్షేమ బోర్డు ద్వారా బడ్జెట్‌లో నిధులు కేటాయించి గల్ఫ్‌ బాధిత కుటుంబాలను ఆదుకోవాలని గల్ఫ్‌ కార్మిక సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

విధి నిర్వహణలో ఆగిన ఊపిరి

- గుండెపోటుతో కానిస్టేబుల్‌ మృతి


మార్కండేయ మృతదేహం

నేరడిగొండ: పండుగ పూట విషాదం చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో కానిస్టేబుల్‌ శుక్రవారం మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. గుడిహత్నూర్‌ మండలంలోని సీతాగొంది గ్రామానికి చెందిన కొక్కుల మార్కండేయ (52) నేరడిగొండ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా కుంటాల జలపాతం వద్ద గల సోమేశ్వరుడి ఆలయం వద్ద శుక్రవారం బందోబస్తుకు వెళ్లాడు. ఈ క్రమంలో అస్వస్థతకు గురికావడంతో పోలీసు వాహనంలోనే నేరడిగొండ జాతీయ రహదారి వరకు తీసుకురాగా, అక్కడి నుంచి 108 అంబులెన్స్‌లో నేరడిగొండ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ వైద్యాధికారి సద్దాం చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శనివారం ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు తెలిపారు. మృతుడికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఎస్సై శ్రీకాంత్‌, పోలీసు సిబ్బంది సంతాపం ప్రకటించారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి


వెంకటనర్సయ్య (ఫైల్‌)

దిలావర్‌పూర్‌: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న వెంకట నర్సయ్య(60) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఏడాదిన్నరగా స్థానిక పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నాడు. స్వస్థలం ఆదిలాబాద్‌ కాగా ఇటీవల మెట్‌పల్లిలో ఉంటూ విధులు సాగిస్తున్నాడు. శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటు రావడంతో కుటుంబీకులు నిజామాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో మృతదేహాన్ని రాత్రి ఆదిలాబాద్‌ తరలించారు. ఎప్పుడు అందరితో కలివిడిగా ఉంటూ తనదైన ముద్రవేసుకున్న వెంకటనర్సయ్య హఠ్మారణం తోటి ఉపాధ్యాయులు జీర్ణించుకోలేక పోతున్నారు.

కోతులదాడిలో చిన్నారులకు గాయాలు


కోతుల దాడిలో గాయపడ్డ చిన్నారులు



ఖానాపూర్‌: పట్టణంలోని శివాజీనగర్‌ కాలనీలో శుక్రవారం కోతులు దాడిచేసి ఇద్దరు చిన్నారులను తీవ్రంగా గాయపరిచాయి. కాలనీకి చెందిన కొరండ్ల రాహుల్‌తో పాటు బక్కశెట్టి మణి అనే ఐదేళ్ల చిన్నారులపై దాడిచేసి గాయపరిచాయి. కుటుంబ సభ్యులను క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. రోజురోజుకూ కోతుల ఆగడాలు పట్టణంలో ఎక్కువ అవుతున్నాయని, సంబంధిత అధికారులు వెంటనే కోతులను నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

నాగోబా ఆలయంలో శివరాత్రి పూజలు


ప్రవచనాలు బోధిస్తున్న కుమ్ర దత్తు మహారాజ్‌


హారతి ఇస్తున్న పూజారి మెస్రం శేకు

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్‌ నాగోబా ఆలయంలో శుక్రవారం శివరాత్రి పండుగను పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా కుమ్ర దత్తు మహారాజ్‌ ఆధ్వర్యంలో హాజరైన భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనలు వినిపించారు. శివరాత్రి పండుగను పురస్కరించుకుని నాగోబా దర్శనం కోసం వచ్చిన భక్తులకు కేస్లాపూర్‌ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్‌, నాగోబా ఆలయ పూజరి మెస్రం శేకు, మెస్రం వంశం ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే..

పట్టణ సుందరీకరణలో భాగంగా జిల్లా కేంద్రంలోని మూడు ప్రధాన కూడళ్లలో ఫౌంటెన్లను ఏర్పాటు చేశారు. రాత్రివేళ లైటింగ్‌తో పాటు ఫౌంటెన్ల నుంచి నీటిని వదులుతూ జిల్లా ప్రజలను ఆకర్షించే విధంగా ఏర్పాటు చేశారు. అయితే కొన్ని నెలలుగా అవి కళావిహీనంగా కనిపిస్తున్నాయి. బల్దియా అధికారుల నిర్వహణ లోపంతో ఫౌంటెన్‌లో చెత్తాచెదారంతో దర్శనమిస్తున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, నిర్మల్‌









వాహనం చోరీ

- ఇద్దరు దొంగల అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

ఆదిలాబాద్‌టౌన్‌: మహేంద్ర బులేరో వాహనం చోరీకి గురైన సంఘటన పట్టణంలోని వన్‌టౌన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన మహ్మద్‌ సర్ఫరాజ్‌ఖాన్‌ ఓ శుభకార్యంలో భాగంగా జిల్లాకు ఈ నెల 6వ తేదీన వచ్చాడు. అదే రోజు జిల్లా కేంద్రంలోని ద్వారకా లాడ్జ్‌లో బస చేశాడు. వాహనాన్ని లాడ్జ్‌ ఎదుట పార్కింగ్‌ చేశాడు. ఉదయం చూసేసరికి వాహనం లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. అయితే పట్టణంలోని పంజాబ్‌ చౌక్‌ ప్రాంతంలో శుక్రవారం వాహనాల తనిఖీలో భీంరావు మహద్‌ మోరే, నదీమొద్దీన్‌ ఖాజీలు అనుమానాస్పదంగా కనిపించగా పోలీసులు పట్టుకుని విచారించగా బులేరో వాహనాన్ని దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. నెల రోజుల క్రితం బాంబే సమీపంలోని వాసి ప్రాంతంలో ఒక స్టీమ్‌ కారును దొంగలించి, అదే కారులో తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో చెప్పారు. వీరితో పాటు మరో ఇద్దరు మహ్మద్‌ షాకీబ్‌, జునైద్‌లు కూడా ఉన్నట్లు తెలిపారు. వీరంతా యవత్మాల్‌ జిల్లాకు చెందిన వారుగా గుర్తించినట్లు సీఐ తెలిపారు. షాకీబ్‌, జునైద్‌ల ఆచూకీ కోసం గాలిస్తున్నామని, భీంరావు, నదీమొద్దీన్‌లను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ చెప్పారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రాజూరలో ఒకరి అదృశ్యం


జెడ్ల కర్రెన్న(ఫైల్‌)

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామానికి చెందిన జెడ్ల కర్రెన్న అదృశ్యమైనట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... కర్రెన్న గురువారం ఉదయం ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. గురువారం నుంచి ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకుతున్నప్పటికీ ఆచూకీ లభించలేదు. శుక్రవారం అతడి భార్య గోదావరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- పీఆర్టీయూ టీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్‌: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పీఆర్టీయూ టీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్‌ పట్టణంలోని యాదవ సంఘ భవనంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో సంఘం ముందుండి పోరాడుతుందన్నారు. రెగ్యులరైజేషన్‌ చేయడంలో సాంకేతిక సమస్యలున్నాయని, అప్పటి వరకు మినిమం టైమ్‌ స్కేల్‌ అమలు చేయాలని ప్రభుత్వానికి సూచించడం జరిగిందన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు.

హరీశ్‌రావు ఫ్లెక్సీ దహనం..

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులను కించ పరిచే విధంగా మాజీ మంత్రి హరీశ్‌రావు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్‌ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో హరీశ్‌రావు ఫ్లెక్సీని దహనం చేశారు. బీఆర్‌ఎస్‌ హాయంలో 15 తేదీ వరకు వేతనాలు వచ్చేవి కాదని, ప్రస్తుతం ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు అందుతున్నాయన్నారు. డీసీసీబీ చైర్మన్‌ అడ్డి భోజారెడ్డి, ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్వతి సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూర్‌సింగ్‌, నవీన్‌యాదవ్‌ ఉన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్‌: రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ తెలంగాణ ఉపాధ్యాయ సంఘం కృషి చేస్తోందని ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. నిర్మల్‌ జిల్లా శాఖ అధ్యక్షుడు వోడ్నాల రవిరాజు ఆధ్వర్యంలో గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో నిర్వహించిన ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తమ సంఘం నిరంతర కృషితో 317 జీవో వలన తలెత్తిన సమస్యల పరిష్కారానికి మంత్రి దామోదరం రాజానర్సింహా అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు అయిందన్నారు. నిర్మల్‌ జిల్లా జెడ్పీటీసీల సంఘం అధ్యక్షులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఉన్నారు.

హరీశ్‌రావు వ్యాఖ్యలు హాస్యాస్పదం

- ఉద్యోగులకు క్షమాపణ చెప్పాలి
- నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్‌


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్‌

ఎదులాపురం: ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు అందించే విషయంలో హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరి గంగాధర్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్‌ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుబంధు డబ్బులు నిలిపివేసి ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నారని హరీశ్‌రావు పేర్కొనడంలో అర్థం లేదన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఉద్యోగులను గుర్తించకుండా వారాల తరబడి జాప్యం చేస్తూ ఇబ్బందులకు గురిచేసిందన్నారు. కానీ కాంగ్రెస్‌ ప్రభుత్వ ఒకటో తారీఖునే జీతాలు అందిస్తుంటే చూసి ఓర్వలేక హరీశ్‌రావు అనుచితంగా మాట్లాడారని మండిపడ్డారు. ఎన్టీఆర్‌ హయాం నుంచి ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం నిలబడలేదన్నారు. ఇకనైనా ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలని, ఉద్యోగులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని అన్నారు. ఇందులో జిల్లా అసోసియేషన్‌ అధ్యక్షుడు రమేశ్‌ గౌడ్‌, కార్యదర్శి ఇందిరా పాల్గొన్నారు.

బతుకుచిత్రం...







శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాల్లో ప్రత్యేక పూజల కోసం భక్తులు ఆలయాలబాట పట్టారు. కొందరు యాచకులు పొట్ట చేతపట్టుకొని ఎర్రటి ఎండలో చిన్నారులకు కనీసం ఒంటిపై చొక్కాలు లేకుండా బతుకు ఆటను ఆడుతున్నారు. శివుడి మెడలో ఉండే ఆదిశేషుడిని తన బుట్టలో వేసుకొని ఆటాడిస్తూ అలరిస్తున్నాడు. భక్తులు వేసిన చిల్లరతో బతుకు నీడుస్తున్నారు. ఆ దృశ్యాలను దిలావర్‌పూర్‌ మండలం కదిలి పాపేశ్వర ఆలయం ఎదుట సాక్షి క్లిక్‌ మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్‌, నిర్మల్‌